సాక్షి సంగారెడ్డి

సోమవారం । 14 । జూలై । 2025



వనం.. కదలాలి జనం

వనమహోత్సవంలో భాగంగా తల్లిపేరిట మొక్కలు నాటాలని హుస్నాబాద్ అధికారులు పిలుపునిస్తున్నారు. వివరాలు 8లో ▸



డ్రాగన్ ఫ్రూట్‌కు ధరాఘాతం

నాడు రైతులకు కాసులు కురిపించిన డ్రాగన్ ఫ్రూట్ నేడు నిలువునా ముంచింది. వివరాలు 8లో ▸



రక్తదానంతో ప్రాణదానం

యువకులు విరివిగా రక్తదానం చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అశోక్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, ఇరిగేషన్ ఏఈ, విద్యుత్ ఏఈ, ఎంఈఓ, ఏపీఎం.ఎంఏఓ,పీఆర్ ఏఈ,అగ్రికల్చర్ ఏఓ, హార్టీకల్చర్ అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే తమ సమస్యలను దరఖాస్తు రూపంలో అందజేసి రశీదు తీసుకోవాలని సూచించారు.

15, 16 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

సంగారెడ్డిజోన్: పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో 1,100 మీ.మీ డయా పైప్‌లైన్ లీకేజీతో ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగభూషణం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదక్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

టైపు రైటింగ్ పరీక్షకు 68 మంది హాజరు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించిన టైపు రైటింగ్ పరీక్షకు 68 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ జానకీ దేవి ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

పీఈటీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న పీఈటీలు


సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా పీఈటీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా కేంద్రమైన పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గౌసొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా మారుతి, కోశాధికారిగా కిష్టయ్య, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌తోపాటు మహిళా కార్యదర్శిగా సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాయామ విద్యలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పీఈటీలు పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

నిరాహార దీక్షను జయప్రదం చేయాలి

సంగారెడ్డి టౌన్: కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష నిర్వహించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ తెలిపారు. జిల్లాలోని గీత కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు పెంచండి

మంత్రి సీతక్కకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విజ్ఞప్తి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న వెంకటయ్య

దుబ్బాక: జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు పెంచాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందే ఎస్సీల రిజర్వేషన్లు పెంచాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో ఎస్సీల జనాభా 15 నుంచి 18 శాతానికి పెరిగిందన్నారు. తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వెంకటయ్య తెలిపారు.

లక్ష్యం.. 40 లక్షలు

పండగలా వనమహోత్సవం

- ఇప్పటివరకు నాటినవి 9.73 లక్షలు
- గతేడాది నాటకుండా మిగిలినవి 19 లక్షలు
- ప్రతీ మొక్కకూ జియో ట్యాగింగ్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో ఈసారి 40.99 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ముందుగా 38 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ లక్ష్యాన్ని మరో రెండు లక్షల మొక్కలు పెంచారు. ఇప్పటి వరకు 9.73 లక్షల మొక్కలు నాటినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వర్షాకాలం ముగిసే లోపు మిగిలిన మొక్కలను నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఎప్పటిలాగే ఈసారి కూడా మొత్తం 11 ప్రభుత్వ శాఖలకు ఈ మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 23 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈత, తాటి వంటి మొక్కలు 1.35 లక్షలు నాటాలని నిర్ణయించారు. అలాగే అటవీశాఖ ద్వారా 3.60 లక్షల మొక్కలు, జాతీయ రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు నేషనల్ హైవే అథారిటీ శాఖ ద్వారా 75 వేల మొక్కలు నాటనున్నారు. జిల్లాలో ముంబై హైవేతోపాటు, ఎన్‌హెచ్ 161 కూడా ఉంది. ఈ రెండు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని భావిస్తున్నారు. అలాగే జిల్లాలో వివిధ పరిశ్రమల్లోని ఖాళీ స్థలాల్లో కూడా మొక్కలు నాటేలా టీజీఐఐసీ ద్వారా లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇంటి వద్ద, పెరడులో నాటేందుకు..

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా జిల్లా ప్రజలు తమ ఇండ్ల వద్ద నాటుకునేందుకు కూడా మొక్కలను సిద్ధం చేశారు. ఇంటి వద్ద నాటుకునేందుకు నిమ్మ, జామ, సపోట, గన్నేరు, మందారం, తులసి, ఉసిరి, వేప వంటి మొక్కలను సరఫరా చేస్తున్నారు. పెరడులో ఈ పండ్లు, పూల మొక్కలు నాటుకునేలా ప్రోత్సహిస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గుల్‌మోహర్, గంగరావి, పచ్చతురాయి వంటి మొక్కలను సిద్ధం చేశారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ కింద కానుగ, వేప, అల్లనేరెడు, రేగు, సిస్సు వంటి రకాల మొక్కలను నాటుతున్నారు. చెరువు గట్లపై నాటేందుకు సీతాఫలం, మామిడి, జామ, కొబ్బరి వంటి మొక్కలను సరఫరా చేస్తున్నారు.

619 నర్సరీల్లో మొక్కల పెంపకం..

ప్రభుత్వం చేపట్టిన ఈ వనమహోత్సవం కార్యక్రమానికి అవసరమైన మొక్కలను సరఫరా చేసేందుకు జిల్లా వ్యాప్తంగా వివిధ చోట్ల ఉన్న 619 నర్సరీల్లో మొక్కలను పెంచారు. గతేడాది సుమారు 19 లక్షల మొక్కలు నాటకుండా మిగిలిపోయాయి. ఈ మొక్కలు ఆయా నర్సరీల్లో పెంచారు. ఇలా మిగిలిపోయిన 19 లక్షల మొక్కలను ఈసారి నాటుతున్నారు. అయితే నర్సరీల్లో మొక్కల జర్మినేషన్ సుమారు 11 శాతానికి తగ్గినట్లు సమాచారం.

బతుకుతున్నది 59 శాతమే..

గత ప్రభుత్వ హయాంలో హరితహారం పేరుతో ఏటా వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రభుత్వం కూడా వనమహోత్సవం పేరుతో మొక్కలను నాటుతున్నారు. అయితే వాటిని నీళ్లు పోసి కాపాడటంలో మాత్రం విఫలమవుతున్నారు. దీంతో రూ.కోట్లలో ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీశాఖ గణాంకాల ప్రకారం నాటిన మొక్కల్లో బతికిన మొక్కలు 59 శాతం ఉండగా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లెక్కల ప్రకారం ఇంత కంటే ఎక్కువే ఉంది. నాటిన మొక్కల్లో కనీసం 30% కూడా బతకడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈసారి ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని భావిస్తున్నారు.

‘ఎన్విరో’ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- ప్రమాదంలో దగ్ధమైన లారీ, జేసీబీ
- తృటిలో తప్పించుకున్న కార్మికులు
- మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సిగాచి ప్రమాద ఘటన మరువక ముందే మరో పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం కలకలం రేపింది. అయితే ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పారిశ్రామిక వాడలోని ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ సర్వీసెస్ పరిశ్రమలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. లారీలో వచ్చిన ఫార్మా వ్యర్థాల లోడును జేసీబీతో తీసే క్రమంలో ముందుగా పొగలు వచ్చి, మంటలు వ్యాపించాయి. దీంతో వెంటనే అక్కడే ఉన్న పది మంది కార్మికులు బయటకు వచ్చేశారు. దీంతో వారంతా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కాగా, మంటలు కాస్తా అగ్నికీలలుగా మారడంతో లారీతోపాటు జేసీబీ కూడా అగ్నికి ఆహుతయ్యాయి. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో హుటాహుటిన నాలుగు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ...పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌ఫైట్ సిస్టమ్‌ను, గ్రౌండ్‌లెవెల్‌లో వాటర్ సంపును ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రూ. 250 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): నియోజకవర్గంలో రూ. 250 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయనుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం నల్లవాగు ప్రాజెక్టు వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... రహదారులకు మహర్దశ కల్పించేందుకు రాష్ట్రంలోని ఒకొక్క ఎమ్మెల్యేకు ఆర్‌అండ్‌బీ హ్యామ్ పథకం కింద నిధులు కేటాయించిదని వివరించారు. కల్హేర్ మండలంలో మాసాన్‌పల్లి చౌరస్తా నుంచి సిర్గాపూర్ వరకు, ఖేడ్ నుంచి కరస్‌గుత్తి వరకు, ఖేడ్ నుంచి రాయిపల్లి వరకు, పెద్దశంకరంపేట నుంచి హన్మంత్‌రావుపేట్ మీదుగా వెంకటపూర్ చౌరస్తా వరకు రహదారులు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జల్ జీవన్ పథకం కింద ఎంపీ సురేశ్‌షెట్కార్ సహకారంతో బోరంచవ్వ మంజీర నది నుంచి తాటిపల్లి గ్రామ సమీపంలో సంప్ నిర్మించి ఖేడ్ పట్టణానికి ప్రత్యేకంగా పైప్‌లైన్ ద్వారా మంచి నీటి సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కామారెడ్డి జిల్లా కౌలాస్ నాలా ప్రాజెక్టు వద్ద ఫిల్టర్ బెడ్‌లు నిర్మించి కంగ్టి మండలంలో నీటి సరఫరాకు పనుల పరిశీలన జరుగుతుందని తెలిపారు.

సిగాచి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి



బోనాల వేడుకల కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- యాజమాన్యం అత్యాశే 52 మంది ప్రాణాలు తీసింది

పటాన్‌చెరు: నిపుణులైన కార్మికులు విధులు నిర్వర్తించాల్సిన చోట దినసరి కూలీలతో విధులు నిర్వహించడంతోనే సిగాచి పరిశ్రమలో ప్రమాదం చోటుచేసుకుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. యాజమాన్యం అత్యాశ, కక్కుర్తి వల్లే 52 మంది కార్మికులు మరణించడంతోపాటు మరో 30 మంది జీవితాలు అగమ్య గోచరంగా మారాయని ఆవేదన చెందారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంతోపాటు దినసరి కార్మికులను ప్రమాదకర విధులకు పంపిన సంబంధిత కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశమై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామికవాడలలో గల పరిశ్రమలలో జరుగుతున్న కార్మికుల హక్కుల ఉల్లంఘనపై చర్చించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌తోపాటు కార్మిక శాఖ విభాగం అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఆదివారం బెస్త గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకుని పది తరాల వారికి ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకాంబరిగా వన దుర్గమ్మ

ఏడుపాయల వన దుర్గమ్మ ఆదివారం శాకాంబరిగా దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని రకరకాల ఆకులు, పుష్పాలతో అలంకరించారు. ఆషాఢ మాసం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఒడి బియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. -పాపన్నపేట(మెదక్)



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వన దుర్గమ్మ

నేటి నుంచి కొత్త రేషన్ కార్డులు

జిల్లాలో 4,136 రేషన్ కార్డులు

- 1,51,438మందికి మేలు
- పదేళ్ల ఇబ్బందులు దూరం

నారాయణఖేడ్/సంగారెడ్డి జోన్: జిల్లాలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 14న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పంపిణీ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. చాలామంది రేషన్ కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ఎంతోమంది ఆశగా ఎదురుచూస్తున్నారు. కొత్త కార్డుల జారీతోపాటు కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులకు సైతం అవకాశం కల్పించడంతో మెజార్టీ జనాలకు మేలు చేకూరింది.

నాడు వైఎస్ చలవతో..

ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉండగా 2006-07లో భారీగా రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టారు. నాడు కార్డులున్నవారితోపాటు లేని వారికి కొత్తగా ఫొటోలతో కూడిన కార్డులను భారీ ఎత్తున జారీ చేశారు. అనంతరం 2013లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉండగా రచ్చబండ కార్యక్రమం పేరిట నూతనంగా రేషన్ కార్డులు జారీ చేశారు. లేని వారికి కొత్తగా కార్డులను అందించారు.



పదేళ్ల తర్వాత మళ్లీనేడు..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పట్నుంచి రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వివాహాలు అయిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియ మాత్రం కొనసాగింది. ఈ క్రమంలో చాలామంది పేర్లు తొలగించుకున్నారు. అయితే కొత్త కార్డు పొందలేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. పిల్లలు పుట్టినా వారి పేర్లు కార్డుల్లో నమోదు కాలేదు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నూతన కార్డుల జారీ ప్రక్రియను చేపట్టడంతో ఆన్‌లైన్ ద్వారా కార్డులు లేని వారు అందరూ దరఖాస్తు చేసుకున్నారు. కార్డులు లేని వారికి కొత్త కార్డులు, కార్డుల్లో పిల్లల పేర్లనమోదు, పెళ్ళిళ్లు అయిన వారు, చనిపోయిన వారి పేర్లు తొలగించే అవకాశాలు కల్పించారు. చాలామంది పెళ్లై అయి వేరే కాపురం ఉన్నవారు, పిల్లలు పుట్టి వారి పేర్లు కార్డుల్లోలేని వారు, కొత్తగా కార్డులు లేని వారు నమోదు చేయించుకుని కార్డులను పొందారు.

పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం..

రాష్ట్రంలో అమలయ్యే పలు సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో చాలామందికి కార్డులు లేక పథకాలను పొందలేక పోయారు. కొందరు తమ పిల్లల పేర్లు కార్డులో లేకపోవడతో వారికి లభించే పథకాలను కోల్పోయారు. నేడు కొత్త కార్డుల జారీ, లేని పేర్లు యాడ్ చేయడం వల్ల అందరికీ మేలు చేకూరినట్టైంది. ఇది నిరంతర ప్రక్రియగా ఉంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా కార్డులను లబ్ధిదారులు కార్డుల ప్రింటవుట్లను తీసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో పాత రేషన్ కార్డుల వివరాలు

జిల్లా	పాత కార్డులు	సభ్యులు
సంగారెడ్డి	3,78,511	12,32,137
సిద్దిపేట	2,91,374	8,93,479
మెదక్	2,13,771	6,85,114

ఉమ్మడి జిల్లాలో కొత్త రేషన్ కార్డుల వివరాలు

జిల్లా	కొత్త కార్డులు	సభ్యులు
సంగారెడ్డి	4,136	1,51,438
సిద్దిపేట	7,956	1,79,096
మెదక్	611	99,414

స్మార్ట్ కార్డు రూపంలో కార్డుల పంపిణీ

నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు సరికొత్త విధానంలో అందించనున్నారు. బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబాలకు మూడు రంగులతో ఉన్న కార్డు, ఏపీఎల్ కుటుంబాలకు పచ్చ కార్డులను ఇవ్వనున్నారు. క్యూఆర్ కోడ్ కలిగి ఉన్న స్మార్ట్ రేషన్ కార్డును పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమయానికి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆశాభావం వ్యక్త చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్‌లోని గౌడ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ తల్లి బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌తోపాటు నాయకులు శివరాజ్‌పాటిల్, శ్రీధర్‌రెడ్డి, చింతా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు

బుద్ధవిహార్‌లో నటుడు గగన్ మాలిక్



వర్ధమాన సినీనటుడు గగన్ మాలిక్ జహీరాబాద్‌లోని బూచినెల్లిలో ఉన్న బుద్ధవిహార్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుమూల ప్రాంతమైన బూచినెల్లిలో బౌద్ధ విహారాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచ శాంతి కోసం నవంబర్‌లో కర్ణాటకలోని గుల్బర్గాలో ఉన్న బౌద్ధ విహార్ నుంచి తెలంగాణలోని నాగార్జున సాగర్ బుద్ధవనం వరకు బౌద్ధ భిక్షువులు పాదయాత్ర చేస్తారని, శాంతికాముకులు సంఘీభావం తెలపాలని కోరారు. -జహీరాబాద్

నటుడు కోటకు పత్ర చిత్ర నివాళి



నాలుగు దశాబ్దాలపాటు సినీ, నాటక రంగాల్లో తన నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొని ఆదివారం కన్నుమూసిన నటుడు కోట శ్రీనివాసరావుకు ఖేడ్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ ఇలా రావి ఆకుపై ఆయన బొమ్మను గీసి నివాళి అర్పించారు. - నారాయణఖేడ్

క్లుప్తంగా

గంభీర్‌పూర్ యువకుడికి డాక్టరేట్

దుబ్బాకరూరల్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఆర్మీ, ఎస్ఎస్‌జీడీకి ప్రిపేర్ అవుతున్నారు. సైనిక వాట్సాప్ గ్రూప్ ద్వారా 8వేల మందికి ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. సైనిక గ్రూప్‌కు దుబ్బాక మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన అరిగె లోకేష్ ఫౌండర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇతని సేవలు గుర్తించిన మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో నిర్వహించిన ఓ సభలో డాక్టరేట్ ప్రదానం చేశారు. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నేరెళ్ల మల్యాద్రి చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు.

'ఐఐటీ'కి దామరకుంట పాఠశాల ఎంపిక


దామరకుంట పాఠశాల ఎంపికైన పత్రాలను చూపిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఐఐటీ మద్రాసు యునివర్సిటీ భాగస్వామ్యంగా ధృవీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరాములు మాట్లాడుతూ జిల్లాలోనే దామరకుంట పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సుభాష్‌చందర్, వెంకటనర్సింహా రెడ్డి, బ్రహ్మయ్య, పుష్పలత, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుడితో పనులు

బేకరి నిర్వాహకుడిపై కేసు నమోదు

నర్సాపూర్: బాల కార్మికుడితో పని చేయిస్తున్న బేకరి నిర్వాహకుడిపై కేసు నమోదైంది. ఈ ఘటన నర్సాపూర్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ లింగం వివరాల ప్రకారం... ఎస్ఐ యాదగిరి, కానిస్టేబుళ్లు రమేష్, మోహన్, నాగరాజు, జ్యోష్ణతో ఏర్పాటైన ముస్కాన్ బృందం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్ఎల్‌వి అయ్యంగార్ బేకరిలో బాల కార్మికుడు పని చేస్తున్నట్లు ముస్కాన్ బృందం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బేకరి నిర్వాహకుడు శశిధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఎక్కుతుండగా.. ఆభరణాలు తస్కరణ

రామాయంపేట(మెదక్): మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలను తస్కరించారు. ఈ ఘటన రామాయంపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన ఉస్కంటి రత్నమ్మ పని నిమిత్తం ఆదివారం రామాయంపేట మున్సిపాలిటీకి వచ్చారు. సాయంత్రం తిరిగి స్వగ్రామం వెళ్లడానికి బస్టాండులో బస్సు ఎక్కుతున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మెడలో ఆభరణాలు కనిపించకపోవడంతో విలపిస్తూ ఇతర ప్రయాణికులు, కండక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నారాయణఖేడ్: ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో సామగ్రి, నగదు, ధాన్యం దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని అబ్బెంద గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నెర్గల్ శివరాములు ఇంట్లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న 2క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటాళ్ల జొన్నలు, రూ.2.76లక్షల నగదు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. కుటుంబీకులు, స్థానికులు నీటితో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ పెద్దలు రాంరెడ్డి, స్థానికులు కోరారు.

వనం.. కదలాలి జనం

- తల్లి పేరిట మొక్కలు నాటాలని పిలుపు
- ఇంటికో చెట్టు..ఊరంతా వనం నినాదం
- నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు
- పలు చోట్ల నాటేందుకు సిద్ధం


పట్టణంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది

వృక్షో రక్షతి రక్షితః. చెట్టును నీవు కాపాడితే ఆ చెట్టు నిన్ను కాపాడుతుందనే నానుడితో మున్సిపల్ అధికారులు వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నర్సరీల్లో నాటడానికి మొక్కలను సిద్ధం చేశారు. నాటడానికి ఇప్పటికే పలు ఖాళీ ప్రదేశాలను సైతం గుర్తించారు.అలాగే తల్లి పేరిట మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

– హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలో 20 వార్డులు, 7533 ఇండ్లు ఉన్నాయి. ఈ సీజన్‌లో పట్టణంలో 54 వేల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. స్థానిక నర్సరీలో వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచారు. రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని చోట్ల మొక్కలు నాటారు. మున్సిపల్ బడ్జెట్‌లో 10 శాతం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 5శాతం మొక్కల సంరక్షణకు ఖర్చు పెట్టాలని నిబంధన ఉంది. అయితే అటవీ శాఖ నుంచి పెద్ద మొక్కల కోసం ఆర్డర్ ఇచ్చారు. ఇవే కాకుండా ములుగు అటవీ ప్రాంతం నుంచి కూడా తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఇంటికి నాలుగు నుంచి 5 వరకు పండ్లు, పూల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి వద్ద మొక్కలు పెంచాలని, పచ్చదనం దిశగా ప్రయాణం


తల్లి పేరిట మొక్క నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు (ఫైల్)

చేద్దామని విద్యార్థులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

తల్లి పేరిట మొక్కలు నాటుదాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం ద్వారా తల్లి పేరిట ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చింది. మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరూ తల్లి పేరిట మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందించాలని మున్సిపల్ అధికారులు ప్రచారం కల్పిస్తున్నారు. ఇంటికో చెట్టు, ఊరంతా వనం అనే నినాదంతో ముందుకెళుతున్నారు. ఇందులో భాగంగానే హుస్నాబాద్ మినీ స్టేడియంలో ప్రముఖులు తమ తల్లి పేరిట మొక్కలు నాటారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన తల్లి పొన్నం మల్లమ్మ పేరిట, రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీస్‌ల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తన తల్లి వాకిటి రాములమ్మ పేరిట మొక్క నాటారు. అలాగే స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేనారెడ్డి, కలెక్టర్ హైమావతి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి , అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తల్లుల పేరిట మొక్కలు నాటి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

భాగస్వామ్యం కావాలి



ప్రతి ఒక్కరూ వన మహోత్సవంలో భాగస్వామ్యం కావాలి. ఇంటి వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి. తల్లి పేరిట ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ప్రతి ఇంటికి పంపిణీ చేస్తాం. చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

డ్రాగన్ ఫ్రూట్‌కు ధరాఘాతం

- మార్కెట్ లేకపోవడంతో రైతులకు నష్టం
- మహారాష్ట్ర నుంచి దిగుమతులతో కష్టాలు
- నాడు కాసులు.. నేడు కన్నీళ్లు
- ఉమ్మడి మెదక్‌లో 300 ఎకరాల్లో సాగు


జహీరాబాద్ నుంచి మార్కెట్ కు తరలించేందుకు సిద్ధం చేసిన డ్రాగన్ ఫ్రూట్

జహీరాబాద్: ఒకప్పుడు రైతులకు కాసులు కురిపించిన డ్రాగన్ ఫ్రూట్ నేడు గిట్టుబాటు ధర రాక రైతులను కన్నీళ్లు పెట్టిస్తోంది. పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ నగరానికి దిగుమతి కావడమే కారణమని పేర్కొంటున్నారు. అక్కడి నుంచి నిత్యం బాటసింగారంలో పండ్ల మార్కెట్‌కు సుమారు 70 టన్నుల వరకు దిగుమతి కావడంతో గిట్టుబాటు ధర లభించకుండా పోతోందని వాపోతున్నారు. బాట సింగారం మార్కెట్‌కు నిత్యం రాష్ట్రం నుంచి 60టన్నులకు పైగా పంట వస్తోంది. మార్కెట్‌లో కిలో ధర పండు నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.60లు మాత్రమే లభిస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో కిలో ధర రూ.100 నుంచి రూ.120 వరకు పలికేదని, ఇప్పుడు పరిస్థితి తారుమారైందని అన్నదాతలు వాపోతున్నారు.

ఏటా సాగుకు లక్షల్లో ఖర్చు

సాగుకు ప్రతి ఏటా ఎకరానికి రూ.2లక్షల మేర పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతుండటంతో నష్టాలను చవి చూస్తున్నారు. కిలో ధర రూ.50 నుంచి రూ.100 ఇస్తేనే గిట్టుబాటు అవుతుంది. సమస్యను బాటసింగారం పండ్ల మార్కెట్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి వివరించినట్లు రైతులు చెప్పారు. మహారాష్ట్ర నుంచి దిగుమతులను నిలిపివేయాలని కోరినట్లు కూడా తెలిపారు. అక్కడి రైతులు నిత్యం 40వాహనాల్లో పంటను హైదరాబాద్ తీసుకుని వచ్చి తక్కువ ధరకు విక్రయాలు జరుపుతున్నారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 300 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగవుతోంది. ప్రధానంగా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, జోగిపేట, నర్సాపూర్, నారాయణఖేడ్, గజ్వేల్, సిద్దిపేట, మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

నష్టాలు వస్తున్నాయి



ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి డ్రాగన్ ఫ్రూట్ దిగుమతి అవుతున్నందున ఈ ప్రాంత రైతులు నష్టపోతున్నారు. ఎకరానికి రూ.2లక్షల మేర నష్టం వస్తోంది. కిలో ధర రూ.50 నుంచి రూ.100 పలికితే రూ.2లక్షల మేర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ రెండంచెల దళారీ వ్యవస్థతో ధర రావడం లేదు.

– బి.రమేష్ రెడ్డి, డ్రాగన్ ఫ్రూట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ స్టేట్ డైరెక్టర్


మహారాష్ట్ర నుంచి దిగుమతులు నిలిపివేయాలని బాట సింగారం మార్కెట్ అధికారులను కోరుతున్న రైతులు

దళారులకు ఆదాయం..రైతుకు నష్టం

రైతుల దగ్గర కొనుగోలు చేసుకున్న వ్యాపారులు మాత్రం మూడు రెట్లు ధర పెంచి విక్రయించుకుంటున్నారు. కిలో ధర రూ. 80 నుంచి రూ.150 వరకు అమ్మకాలు చేస్తున్నారని, సూపర్ మార్కెట్లో అయితే రూ.200లకు విక్రయాలు జరుగుతున్నాయి. ఏడాది పొడవున కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర రావడం లేదు. కానీ అప్పటికప్పుడు కొని విక్రయించుకుంటున్న వ్యాపారులు మాత్రం రెట్టింపు ఆదాయంతో లబ్ధి పొందుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేసేందుకు ఎకరాకు రూ.5లక్షల మేర పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని, సాగు చేశాక రెండో సంవత్సరం నుంచి పంట దిగుబడులు వస్తాయని తెలిపారు. మొదటి పంట ఏడాదికి ఎకరానికి ఐదు టన్నుల మేర వస్తుంది. క్రమంగా ప్రతి ఏటా పెరుగుతూ 10టన్నుల వరకు చేరుకుంటుంది. పది సంవత్సరాల తర్వాత దిగుబడులు తగ్గుతూ వస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆపరేషన్ చేశాక రెండు రోజులకు వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల వివరాల ప్రకారం... పట్టణంలోని సాజిద్ పురకు చెందిన అహ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్ పటేల్(28) ఈ నెల 11న మధ్యాహ్నం కడుపునొప్పితో శ్రీనివాసనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా వైద్యులు ఆపరేషన్ చేశారు. అనంతరం అతడికి బీపీ తగ్గిందని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. అనుమానం వచ్చిన కుటుంబీకులు సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్‌ను అడగగా ఆపరేషన్ చేశామని ఒకసారి, ఆపరేషన్ చేయలేదని మరోసారి పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయాడని కుటుంబీకులు ఆరోపించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

చిన్నశంకరంపేట(మెదక్): అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన మండలంలోని కొరివిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాజ్‌పల్లి గ్రామం నుంచి ట్రాక్టర్‌లో సెంట్రింగ్ పనులకు సంబంధించిన వస్తువులను తీసుకొని మండలానికి వస్తున్న క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. సెంట్రింగ్ చెక్కలు రోడ్డుపై పడిపోవడంతో కొద్దిసేపు మెదక్–చేగుంట రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

భారీగా బెల్లం, పటిక పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ శాఖ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం, పటికను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా... మండలంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రూట్ వాచ్ నిర్వహించారు. ఈ క్రమంలో బొత్తలపర్రె తండాకు చెందిన భూక్య రమేష్ తన బైక్‌పై ఐదు కిలోల పటిక, 20 కిలోల బెల్లం, 2లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారించగా అక్కన్నపేటకు చెందిన బింగి చంద్రమౌళి, శారద వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పాడు. దీంతో అక్కడ తనిఖీ చేయగా 980 కిలోల నల్లబెల్లం, 45కిలోల పటికను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు రూప, దామోదర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమై.. హత్యకు గురై


తాజోద్దీన్

జహీరాబాద్ టౌన్: యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని సింగితం మోహలాకు చెందిన తాజోద్దిన్(22) శనివారం నమాజ్ కోసం జామా మసీద్‌కు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. బైక్ మసీద్ వద్ద ఉండటంతో అనుమానంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రహమత్ నగర్ పరిసర ప్రాంతంలోని ఓ వెంచర్ వద్ద పాడుపడిన బావిలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు టౌన్ సీఐ.శివలింగం ఘటనా స్థలానికి వెళ్లి క్రేన్ సహాయంతో బయటకు తీశారు. శరీరంపై కత్తితో పొడిచిన గాయాలు న్నాయి. ప్రార్థన మందిరంలో నమాజ్ చేస్తున్న తాజోద్దిన్‌ను ఇద్దరు యువకులు బైక్‌పై తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీలో కనిపించింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మైసయ్య

వెల్దుర్తి(తూప్రాన్): అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మైసయ్య, బాలమ్మలు భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు సంతానం. ఏడాది క్రితం కూతురు వివాహం చేశారు. పెళ్లికి అయిన అప్పులు తీర్చడానికి హైదరాబాద్‌లోని అల్వాల్ ప్రాంతంలో ఉంటూ పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం భార్య, కుమారుడితో కలిసి వారు నివాసమున్న ప్రాంతానికి సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. కొద్ది సేపటికీ మైసయ్య డ్యూటీకి వెళ్తున్నానని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో వర్షం పడుతుందని బట్టలు తీసుకోవాలని చెప్పడానికి వచ్చిన పక్కింటి మహిళ కిటికీకి వేలాడుతున్న మైసయ్య మృతదేహాన్ని చూసింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వారు వచ్చి ఆస్పత్రికి తరలించగా చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. అప్పులు అధికం కావడంతో కొద్ది రోజులుగా బాధ పడుతున్నాడని, ఈ క్రమంలో ఉరేసుకున్నాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చిత్తం

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బోనాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మురాడి చిత్తం(55) పొలం వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. వ్యవసాయ పొలాలకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోయినట్లు గుర్తించిన అతడు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సరఫరా నిలిపివేసి ఫ్యూజ్ వైర్‌ను వేసేందుకు పైకి ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చిత్తం ట్రాన్స్‌ఫార్మర్‌పైనే మృతి చెందాడు. స్థానిక రైతుల సమాచారంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన ప్రమోద్ ఠాగూర్(50) బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉంటూ స్థానికంగా ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే నాలుగు నెలల క్రితం తన స్వగ్రామానికి వెళ్లి, శనివారం రాత్రి ఇస్నాపూర్‌కు చేరుకున్నట్టు తన భార్య సంగీతా దేవికి ఫోన్ ద్వారా చెప్పాడు. అనంతరం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇస్నాపూర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ప్రమోద్ ఠాగూర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం, పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి సాగు.. సస్యరక్షణ చర్యలు

- ఆధునిక పద్ధతులతో తెగుళ్ల నివారణ
- చీడపీడలను తట్టుకునే గింజలనే విత్తాలి
- రైతులకు అధికారుల అవగాహన
- సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు


గజ్వేల్ డివిజన్‌లో పత్తి సాగు

రైతులు పండించే వాణిజ్య పంటల్లో పత్తి ముఖ్యమైనది. ప్రతి సంవత్సరం రైతులు పత్తిని సాగు చేస్తున్నారు. విత్తనాలు విత్తిన తర్వాత మొలక దశలో సుమారుగా 10 రకాల పురుగులు పైరును ఆశించి నష్టపరుస్తాయి. పత్తి చేనుకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి పలు సూచనలు చేస్తున్నారు.

మర్కూక్(గజ్వేల్): ములుగు డివిజన్ పరిధిలో గత సంవత్సరం 32వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా, ఈసారి 25 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కూలీల కొరత, తగినంత వర్షపాతం లేకపోవడంతో రైతులు పత్తిపై ఆసక్తి చూపడం లేదు. కాయతొలిచే పురుగులతో పాటు లద్దె పురుగులను తట్టుకునే బోల్గార్డ్–2 సంకర పత్తి విత్తనాలు ప్రస్తుతం మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉన్నాయి. నల్ల రేగడి, నీటి సదుపాయం గల సారవంతమైన ఎర్ర నేలలు పత్తి సాగుకు అనువైనవి.

వేప నూనె పిచికారీ చేయాలి



కూలీల కొరత, వర్షాధార ప్రభావం వల్ల పత్తి సాగుకు మొగ్గుచూపడం లేదు. మొలక దశలో ఉన్న పత్తి చేనుకు వేప నూనె పిచికారీ చేయాలి. ఈ దశలో రసం పీల్చే పురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రైతులు ముందస్తుగా వేప నూనె స్ప్రే చేయడం వల్ల పురుగులు చనిపోతాయి. వర్షాలు మొదలైతే ఈ నెల 20 వరకు పత్తి గింజలు విత్తుకోవచ్చు.

– అనీల్ కుమార్, డివిజన్ వ్యవసాయ అధికారి

సమగ్ర పోషక యాజమాన్యం

పశువుల ఎరువు ఒక ఎకరానికి 4నుంచి 5 టన్నులు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. నత్రజని, పొటాష్ యం ఎరువులను 3నుంచి 4 సార్లు విత్తనాలు విత్తిన 20 నుంచి 90 రోజుల లోపు తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి. పత్తి గింజలు విత్తిన రెండు రోజులలోపు కలుపు నివారణకు ఎకరానికి పెండి మిథాలిన్ 30 శాతం ఇసీ 200 లీటర్ల నీటిలో కలిపి వాడుకోవాలి. మొలక దశలో ఉన్న చేనుకు వేప నూనె పిచికారీ చేస్తే, తెగుళ్ల ఆశించవని అధికారులు తెలిపారు.

పచ్చదోమ

పచ్చదోమ పిల్ల , రెక్కల పురుగులు ఆకు అడుగు బాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల ఆకు దొనెలుగా ముడుచుకొని లేత పసుపు రంగుగా మారి, ఎరుపు రంగుకు మారి రాలిపోతాయి. ఈ పురుగు ఆశించినప్పుడు మొక్కల్లో ఎదుగుదల క్షీణించి మొగ్గలు ఏర్పడక దిగుబడి తగ్గుతుంది.

పేనుబంక

ఈ పురుగులు కొమ్మ చివర గుంపులుగా ఉండి ఆకుల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల ఆకు అడుగు భాగం ముడుచుకుంటుంది. ఈ పురుగులు తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తాయి. దీని వల్ల నల్లని బూజు ఏర్పడి మొక్కలను కప్పేస్తాయి.

తామర పురుగు

ఈ పురుగు సన్నగా పసుపు గోధుమ రంగులో ఉంటుంది. ఆకుల అడుగు బాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. ఆకు అడుగు బాగాన వెండివలే మెరిసే చారలు, వేగంగా తిరుగుతూ సన్నని పేను పురుగును చూసి వీటి ఉధృతిని గమనించవచ్చు.

తెల్ల దోమ

పైరు ముదిరి కొమ్మలు, కాయలు ఏర్పడిన దశలో తరచూ తెల్ల దోమ ఆశిస్తుంది. తెల్ల దోమ ఆశించినచో ఆకులు పసుపు రంగుకు మారి, పొడ మచ్చలు కూడా ఏర్పడతాయి. ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వల్ల కాయలు పక్వానికి రాకుండా రాలిపోతాయి.

పిండినల్లి పురుగు

ఈ పురుగులు తెల్లని మైనం పూత కలిగి కదలిక లేకుండా ఒకే చోట ఉంటాయి. ఈ పురుగు మొదట ఆకుల కింద చేరి క్రమేపి కాండాన్ని ఆశించి గుంపుగా ఉంటూ రసం పీల్చడం వల్ల మొక్కలు ఎండిపోయి చనిపోతాయి. ఈ తెగుళ్లకు సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.


మిర్జాపల్లిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

బోర్ల కింద జోరుగా వరి నాట్లు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వర్షాకాలం వరి నాట్లు జోరందుకున్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక వైపు వర్షాలు ఆలస్యమవుతున్నప్పటికీ బోరుబావుల వద్ద వ్యవసాయ పనులు వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే నారు పెరగడంతో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. స్థానిక కూలీలు రోజుకు రూ.500 తీసుకుంటుండగా, బీహార్ నుంచి వచ్చిన కూలీలు ఎకరానికి రూ.6 వేల చొప్పున తీసుకుని నాట్లు వేస్తున్నారు.